నమస్తే తెలంగాణ

ఖమ్మం

5 | ఖమ్మం, సోమవారం 22 జనవరి 2024 | KHAMMAM

## రైల్వేలైన్ నిర్మాణం కోసం ఏరియల్ సర్వే



కూసుమంచి, జనవరి 21: కేంద్రం దేశవ్యాప్తంగా 12 కొత్త రైల్వే ప్రాజెక్టులు చేపట్టింది. దీనిలో భాగంగా మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్– మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్ వరకు రైల్వేలైన్ నిర్మించనున్నది. రైల్వేలైన్ బొగ్గు, సిమెంట్ వంటి వాణిజ్య వ్యాపార వస్తువుల రవాణాకు ఉపయోగపడనున్నది. ఈ రైల్వేలైన్ సూర్యాపేట జిల్లాకేంద్రంతో ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం గుండా వెళ్లనున్నది. రైల్వే లైన్ నిర్మాణంపై దక్షిణ మధ్య రైల్వే రెండు రోజుల నుంచి నియోజకవర్గంలో ప్రత్యేక ఎయిర్ క్రాఫ్ట్ ద్వారా ఏరియల్ సర్వే చేపడుతున్నది. ఈ సర్వే ఆదివారమూ కొనసాగింది. ఎయిర్‌క్రాఫ్ట్ అత్యంత కింద నుంచి ప్రయాణించడంతో నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. సర్వేపై తదుపరి వివరాలు తెలియరావాల్సి ఉన్నది.

## అభివృద్ధి పనులపై నిత్యం పర్యవేక్షణ ఉండాలి

- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పాలేరు నియోజకవర్గ ప్రగతిపై కలెక్టరేట్‌లో సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మామిళ్లగూడెం, జనవరి 21: అభివృద్ధి పనులపై అధికారులు నిత్యం పర్యవేక్షణ ఉండాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం పాలేరు నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి నియోజకవర్గ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం కలిగేలా మెలగాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. హెల్త్ సబ్ సెంటర్ల నిర్వహణ పక్కాగా ఉండాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనను పటిష్ట పరచాలని, ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని డీఈవో సోమశేఖరశర్మను ఆదేశించారు ఖమ్మం రూరల్‌లో నర్సింగ్ కళాశాల భవనాన్ని నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలన్నారు. తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల నుంచి 100 పడకలకు అప్ గ్రేడ్ అయిందని, అందుకు అనుగుణంగా ఆసుపత్రిలో వసతులు కల్పించాలని, నేలకొండపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆపరేషన్ థియేటర్, కాంపౌండ్ వాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. పాలేరు కెనాల్ మెయిన్ అప్ స్ట్రీం, డౌన్ స్ట్రీం భూములకు డీమార్క్ చేసి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నాయకన్‌గూడెంలో ఐబీ విశ్రాంతి గృహ నిర్మాణానికి టెండర్ రీకాల్ చేయాలని సూచించారు. ఎన్ఎస్పీ, ఎస్సారెస్పీ పనుల పురోగతిపై నివేదిక సమర్పించాలన్నారు. పెద్దతండా, ఏదులాపురం, గుదిమళ్ల, చిన్నవెంకటగిరి గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై నివేదిక ఇవ్వాలన్నారు. మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. గట్టు సింగారం, ముజ్జుగూడెంలలో శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాలల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. పాలేరు నియోజకవర్గంలో మినీ స్టేడియం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. మద్దులపల్లి మార్కెట్ పనులను జూలైలోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్ పాల్గొన్నారు.

## తప్పులులేని ఓటరు జాబితా సిద్ధం చేయాలి



అన్నపురెడ్డిపల్లి : మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అన్నపురెడ్డిపల్లి, జనవరి 21 : తప్పులులేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. ఆదివారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ, సవరణలపై బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 18 ఏండ్లు నిండిన యువత ఓటు హక్కు నమోదు చేసుకునేలా చూడాలని, ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులను చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు తమ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఆర్ఐ మధు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

దమ్మపేట రూరల్, జనవరి 21 : స్పెషల్ సమ్మరి రివిజన్ 2024లో భాగంగా గండుగులపల్లి, మొండివర్రె గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆదివారం అదనపు కలెక్టర్ రాంబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ఓటర్లు ఫారం–6, తొలగింపునకు ఫారం–7, సవరణకు ఫారం–8 ఉపయోగించాలని సూచించారు. గ్రామాల్లో పట్టభద్రులు ఫిబ్రవరి 6వ తేదీ లోగా ఫారం 18తో దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ముజాహిద్ ఉన్నారు.



# ఆరు సబ్జెక్టులు ఏడు ప్రశ్నాపత్రాలు

- ఈ ఏడాది నుంచి కొత్త విధానంలో 'పది' పరీక్షలు
- ఏడు రోజుల పాటు పరీక్షలు
- విద్యార్థుల ఆకాంక్ష మేరకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

అశ్వారావుపేట, జనవరి 21: ఈ ఏడాది నుంచి పదోతరగతి విద్యార్థులు ఆరు సబ్జెక్టులకు ఏడు ప్రశ్నాపత్రాలను ఏడు రోజుల్లో రాయాల్సి ఉంటుంది. రాష్ట్రవిద్యాశాఖ సైన్స్ సబ్జెక్ట్‌కు సంబంధించిన భౌతికశాస్త్రం, జీవశాస్త్ర పరీక్షలను ఒకేరోజు కాకుండా రెండు రోజుల్లో నిర్వహించాలని నిర్ణయించింది. భౌతికశాస్త్ర ప్రశ్నాపత్రం 50 మార్కులు, జీవశాస్త్ర ప్రశ్నాపత్రం 50 మార్కులకు ఉంటుంది. మిగతా ఐదు సబ్జెక్టుల్లో ఒక్కో ప్రశ్నాపత్రం 100 మార్కులకు ఉంటుంది. పరీక్షలు మార్చి 18న ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తాయి.

**విద్యార్థుల కోసమే..**

గతంలో సైన్స్ పరీక్షలు ఒకేరోజు జరిగేవి. దీంతో విద్యార్థులు ఇబ్బందిపడేవారు. కొందరు ఆందోళనలో పరీక్షలు సరిగా రాసేవారు కారు. కొందరు పరీక్షలు ఫెయిల్ అయ్యేవారు. ఫలితంగా జిల్లాల వారీగా ఉత్తీర్ణతశాతమూ తగ్గేది. దీంతో రాష్ట్ర విద్యాశాఖ సైన్స్ రెండు ప్రశ్నాపత్రాలను రెండు రోజులు నిర్వహించాలని నిర్ణయించింది. విద్యార్థుల ఆకాంక్ష మేరకే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది.

**విద్యార్థుల సంఖ్య ఇలా..**

జిల్లాలోని 304 ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, కేజీబీవీ, ఐటీడీఏ, బీసీ వెల్ఫేర్, రెసిడెన్షియల్, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్ విద్యాలయాల్లో 12,341 మంది పదోతరగతి చదువుతున్నారు. వీరిలో బాలురు 5,900 మంది, బాలికలు 6,441 మంది. వీరంతా మార్చి 18 నుంచి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష రాస్తారు. సైన్స్‌కు సంబంధించిన రెండు పరీక్షలు మాత్రం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు జరుగుతాయి.

**'పది' పరీక్షలకు ఏడు ప్రశ్నాపత్రాలు..**

పదోతరగతి పరీక్షల్లో ఈసారి ఆరు సబ్జెక్టులకు ఏడు ప్రశ్నాపత్రాలు ఉంటాయి. సైన్స్‌లో భౌతికశాస్త్ర ప్రశ్నాపత్రం 50 మార్కులు, జీవశాస్త్ర ప్రశ్నాపత్రం 50 మార్కులకు ఉంటుంది.మిగతా ప్రశ్నాపత్రాలు 100 మార్కులకు ఉంటాయి. మార్చి 18 నుంచి పరీక్షలు ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తాయి.

– మాధవరావు, ఏసీజీఈ, కొత్తగూడెం

## ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి సాధ్యం

**మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్**



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్

కూసుమంచి (నేలకొండపల్లి), జనవరి 21: ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రం సమీపంలోని సిద్దార్థ యోగా విద్యాలయంలో ఆదివారం నిర్వాహకుడు డాక్టర్ రామచందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్థ వార్షికోత్సవం, ఆరోగ్య సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యవంతులతోనే మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రతిఒక్కరూ మహాత్మాగాంధీ చూపిన ప్రకృతి జీనవ మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. మన చుట్టూ ఉండే ప్రాంతంలో లెక్కలేనని ఔషధ మొక్కలు ఉంటాయని, వాటి గురించి తెలుసుకుని, ఔషధంగా తీసుకుని ఆరోగ్యవంతులు కావొచ్చన్నారు. డాక్టర్ రామచందర్‌రావు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ 'నో ఆయిల్.. నో బాయిల్' విధానాన్ని అనుసరించి దీర్ఘాయుష్షు పొందవచ్చన్నారు. కార్యక్రమానికి సుమారు 3,000 మంది దేశ, విదేశ ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం అతిథులు ఆరోగ్యసమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రదర్శనకు ఉంచిన బియ్యం, నాటు కూరగాయలు, విత్తన స్టాళ్లు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రజావాగ్గేయకారుడు అందెశ్రీ, జానపద గాయకుడు నాగన్న, పౌల్ట్రీ రంగ నిపుణుడు సి.బలరాం ప్రసాద్ పాల్గొన్నారు.

## 'పేట' సర్కార్ దవాఖానలో క్రిటికల్ సిజేరియన్ సక్సెస్

**తల్లీబిడ్డ క్షేమం**





ప్రసవం తర్వాత తల్లీ బిడ్డ

అశ్వారావుపేట, జనవరి 21: అశ్వారావుపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణికి వైద్యబృందం క్రిటికల్ సిజేరియన్ ఆపరేషన్ చేసి తల్లీబిడ్డను కాపాడారు. తెలిసిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేట మండలంలోని జమ్మిగూడేనికి చెందిన ముప్పాళ్ల కృష్ణవేణి నిండు గర్భిణి. శనివారం ఆమెకు పురుటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను అశ్వారావుపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ఆమెను పరీక్షించి సాధారణ కాన్పు చేసేందుకు ఎదురుచూశారు. గైనకాలజిస్టు రాధారుక్మిణి సాయంత్రం గర్భిణిని మళ్లీ పరీక్షించారు. గర్భిణి కడుపులోని బిడ్డ ఉమ్మనీరు తాగుతున్నదని, శిశువు మెడకు పేగులు చుట్టుకున్నాయని గుర్తించి సిజేరియన్ ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయకుమార్ వెంటనే అప్రమత్తమయ్యారు. పాల్వంచ ప్రభుత్వాసుపత్రి నుంచి ఎనస్తీయనిస్టు ప్రసాద్‌ను పిలిపించారు. వైద్య బృందం గర్భిణికి ఆపరేషన్ చేశారు. గర్భిణి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో గర్భిణి కుటుంబ సభ్యులు వైద్యబృందానికి కృతజ్ఞతలు తెలిపారు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రి చరిత్రలో ఇదే అత్యంత క్రిటికల్ ఆపరేషన్ అని ఆయన తెలిపారు.

## మాయమాటలు చెప్పి ఇద్దరు బాలికల అపహరణ

- స్నేహితుడితో కలిసి లైంగికదాడి చేసేందుకు ఆటోడ్రైవర్ పథకం
- చాకచక్యంగా వ్యవహరించి ప్రమాదం నుంచి బయటపడిన విద్యార్థినులు
- అశ్వారావుపేటలో వెలుగు చూసిన ఘటన



అశ్వారావుపేట, జనవరి 21: నిస్సహాయులైన ఇద్దరు బాలికలకు మాయమాటలు చెప్పి ఆటోలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడడానికి ఇద్దరు యువకులు పథకం పన్నారు. బాలికలు చాకచక్యంగా వ్యవహరించి ఆ ప్రమాదం నుంచి బయటపడిన ఘటన ఆదివారం అశ్వారావుపేట పట్టణంలో వెలుగు చూసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు భద్రాచలంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ స్థానిక కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. వీరు సంక్రాంతి సెలవులకు స్వగ్రామానికి వెళ్లారు. శనివారం ఇద్దరూ తిరిగి భద్రాచలానికి బయల్దేరారు. ఇద్దరు బాలికల్లో ఒకరి బావ ఏపీలోని జీలుగుమిల్లి మండలంలో నివాసం ఉంటున్నాడు. అతనికి కాల్ చేసి బంధువైన బాలిక ఖర్చుల కోసం డబ్బు అడిగింది. జీలుగుమిల్లి సమీప పట్టణమైన అశ్వారావుపేటకు బాలిక బావ రమ్మన్నాడు. దీంతో ఇద్దరు బాలికలు అశ్వారావుపేటకు వచ్చారు. బాలిక తన బావకు ఎన్నిసార్లు కాల్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో సాయంత్రం వరకు పట్టణంలోనే ఉండిపోయారు. ఇది గమనించిన ఒక ఆటోడ్రైవర్ మిత్రుడితో కలిసి బాలికల వద్దకు వచ్చాడు. 'ఉదయం నుంచి మిమ్మల్ని చూస్తున్నాను. ఏదో సమస్యతో సతమతమవుతున్నట్లు గమనించాను. మీరు ఆకలిగా ఉండి ఉంటుంది. మీకు అభ్యంతరం లేకపోతే మా ఇంట్లో రాత్రి సేదితీరి పొద్దున్నే జీలుగుమిల్లిలోని బంధువు ఇంటికి వెళ్లిపోదురు.' అంటూ బాలికలను నమ్మించాడు. ఆటోడ్రైవర్ మాటలు నమ్మి రాత్రి 10 గంటల ప్రాంతంలో బాలికలు ఆటో ఎక్కారు. ఆటో డ్రైవర్ అతడి మిత్రుడు కలిసి వాహనాన్ని ఖమ్మం రోడ్డులోని ఒక నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లారు. వెంట తీసుకొచ్చిన అల్పాహారాన్ని బాలికలకు అందించారు. ఇక అప్పటి నుంచి ఆటోడ్రైవర్ అతని స్నేహితుడు అనుమానాస్పదంగా మాట్లాడడం మొదలుపెట్టారు. అప్రమత్తమైన బాలికలు తమకు ఏదైనా హాని జరుగుతుందేమోనని గ్రహించారు. వెంటనే సమీపంలోని ఓ ఫ్యాక్టరీ గేటు వద్దకు పరుగులు పెట్టారు. అక్కడ సెక్యూరిటీ గార్డుకు విషయాన్ని వెల్లడించారు. సెక్యూరిటి వెంటనే 100కు డయల్ చేశాడు. తర్వాత కేకలు వేసి తోటి కార్మికులను పిలిచాడు. ఇదంతా గమనించిన ఆటోడ్రైవర్‌తోపాటు అతని స్నేహితుడు అక్కడి నుంచి పరారయ్యారు. కొద్దిసేపటి తర్వాత పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాలికలను విచారించారు. బాలికల తల్లిదండ్రులను అశ్వారావుపేటకు పిలిపించి వారికి అప్పగించారు. బాలికలను అపహరించిన ఘటన ఈనోటా ఆనోటా పడి ప్రస్తుతం అశ్వారావుపేట పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఎస్సై శివరామకృష్ణను 'నమస్తే' వివరణ కోరగా.. బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించామని, వారు ఎవరిపైనా ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ ఆటోడ్రైవర్ వివరాలు సేకరిస్తున్నామని సమాధానమిచ్చారు.

## రాష్ట్రస్థాయికి జిల్లా నుంచి 10 సైన్స్ ప్రాజెక్ట్‌లు

**ముగిసిన సైన్స్ ఫెయిర్ ఆన్‌లైన్ మూల్యాంకనం**



ఆన్‌లైన్ మూల్యాకంనం చేస్తున్న న్యాయనిర్ణేతలు

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 21: జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ ఆన్‌లైన్ మూల్యాంకన ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. ఖమ్మం నగరంలోని రెజొనెన్స్ శ్రీనగర్ పాఠశాల కేంద్రంగా ఎనిమిది మంది న్యాయనిర్ణేతలు 187 ప్రాజెక్ట్‌లను ఆన్‌లైన్‌లో నలుగురు టెక్నీషియన్స్ సాయంతో మూల్యాంకనం చేశారు. జిల్లా నుంచి 10 ప్రాజెక్ట్‌లను రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక చేశారు. జూనియర్స్ విభాగంలో వరుసగా ఐదు స్థానాలు, సీనియర్స్ విభాగంలో వరుసగా ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో నమూనాలను ప్రదర్శించనున్నారు. మూల్యాంకన ప్రక్రియను డీఈవో సోమశేఖరశర్మ, డీఎస్వో జగదీశ్వర్ పర్యవేక్షించారు. రెండు రోజుల పాటు ఆతిథ్యం కల్పించిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.

**ఎంపికైంది వీరే..**

**సీనియర్స్ విభాగంలో..**

1).శ్రీవల్లి– రెజొనెన్స్ స్కూల్, ఖమ్మం
2).మిత్ర– జడ్పీహెచ్ఎస్, వేంసూరు
3).ధీరజ్– త్రివేణి పాఠశాల, ఖమ్మం
4).డార్విన్ బాలాజీ– త్రివేణి పాఠశాల, ఖమ్మం
5).సుధీర్– భారత్ బాల మందిర్, ఖమ్మం

**జూనియర్స్ విభాగంలో..**

1).సాయిసింధూర– జడ్పీహెచ్ఎస్, ఏన్కూరు
2).హేమ– బ్లూమింగ్ మైండ్స్ స్కూల్, ఖమ్మం
3).నవదీప్– జడ్పీహెచ్ఎస్, బురదరాఘవాపురం
4).సాత్విక– టీఎస్ఆర్జేసీ, వైరా
5).తమన్– మధు విద్యాలయం, వైరా

## రామయ్యకు బంగారు లాకెట్ సమర్పణ



లాకెట్‌ను ఈవోకు అందిస్తున్న దాత, కుటుంబీకులు

భద్రాచలం, జనవరి 21: భద్రాచలం సీతారామచంద్రస్వామికి సికింద్రాబాద్ బోయినపల్లికి చెందిన అబ్బరాజు లక్ష్మి, అపర్ణ–విజయ్ దంపతులు బంగారు లాకెట్‌ను స్వామి వారికి ఆదివారం బహూకరించారు. ముత్యాలు, కెంపు, బంగారు గుండ్లతో చేయించిన ఈ లాకెట్ విలువ రూ. 1.58 లక్షలు. వారు ముందుగా స్వామి వారిని దర్శించుకుని, అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను సందర్శించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఆ తరువాత దేవస్థానం ఈవో ఎల్ రమాదేవికి లాకెట్‌ను అందజేశారు.

## రామయ్యకు స్వర్ణ పుష్పార్చన



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, జనవరి 21: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలవరులకు అర్చకులు ఆదివారం 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

## రామయ్యను దర్శించుకున్న ఖమ్మం సీపీ



రామయ్యను దర్శించుకున్న ఖమ్మం సీపీ సునీల్‌దత్

భద్రాచలం, జనవరి 21: భద్రాచలం సీతారామచంద్రస్వామిని ఆదివారం ఖమ్మం పోలీస్ కమిషనర్(సీపీ) సునీల్‌దత్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ధ్వజ స్థంభానికి నమస్కరించి, అంతరాలయంలో రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి సన్నిధిలో అర్చకులు వేదాశీర్వచనం, ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

పాల్వంచ, జనవరి 21: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 1978లో (ఆనాడు ఉన్నత పాఠశాల) పదోతరగతి, 1979–80 సంవత్సరాల్లో ఇంటర్ చదివిన విద్యార్థులు ఇన్నేళ్ల తర్వాత ఆదివారం పట్టణ శివారులోని ఆనందాపురం హిల్ వ్యూ రిసార్ట్స్‌లో కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటపాటలు, కబుర్లతో సందడి చేశారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి దాదాపు 80 మంది వచ్చారు.